క్లుప్తంగా

సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలి



సచివాలయంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపీపీ వెంకటరెడ్డి

పోలవరం రూరల్ : సచివాలయాల్లోని సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిచేందుకు కృషి చేయాలని ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి సూచించారు. ఆయన మండలంలోని కొత్తపట్టిసీమ సచివాలయాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎంతమంది సిబ్బంది ఉన్నారు, ఏయే పనులు చేస్తున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు. సిబ్బంది అందరూ పూర్తిగా హాజరవుతున్నారా లేదా అని అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ చేరేలా చూడాలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ



జీలుగుమిల్లిలో ఎరువుల దుకాణాన్ని పరిశీలిస్తున్న ఏడీ గంగాధర్

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి సొసైటీ, పలు ఎరువుల దుకాణాలను కైకలూరు ఏడీ గంగాధర్ గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా షాపుల్లోని ఎరువులు, స్టాక్ రికార్డులను పరిశీలించారు. అదేవిధంగా అంకన్నగూడెం, రాచన్నగూడెం గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాన్ని కూడా తనిఖీ చేశారు. అనంతరం ఏడీ గంగాధర్ మాట్లాడుతూ ఎంఆర్‌పీ రేట్లకే ఎరువులను విక్రయించాలని అన్నారు. అలాగే పలు బస్తాలను తూకం వేశారు. జీలుగుమిల్లి డీసీఎంఎస్ గోడౌన్ ఇన్‌క్లూడింగ్ చేయించాలని షోకాజ్ నోటీసులు ఇచ్చారని తెలిపారు.

95 మందికి వైద్య సేవలు



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా మెడికల్ కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. క్లబ్ నిర్వహణలో అపోలో ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి రెండు గంటల వరకు నిర్వహించిన శిబిరంలో 95 మందికి వివిధ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. రోటరీ క్లబ్ సభ్యులు ఎస్‌బీజీ శేఖర్, బోనగిరి పాపారావు క్యాంపు చైర్మన్‌లుగా వ్యవహరించారు. ఉత్తర అమెరికా తెలుగు సంఘం తానా ఫౌండేషన్, గ్రేస్ కేన్సర్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిబిరాన్ని నిర్వహించారు. ఆధునిక పరికరాలతో ఛాతీ ఎక్స్‌రే, బ్లడ్ షుగర్, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. కార్యక్రమంలో మద్దు గోపి, సిరివెళ్ల సుబ్రహ్మణ్యం, విశ్వనాథ శర్మ, మాజేటి అప్పలరాజు, చిరవూరి శ్రీనివాస్ తదితరులు సేవలందించారు.

ప్రభుత్వ స్థలంలో అక్రమంగా చెట్ల నరికివేత



కోడిగూడెంలో అక్రమార్కులు నరికివేసిన చెట్లు

ద్వారకాతిరుమల : మండలంలోని కోడిగూడెంలో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ స్థలంలోని విలువైన చెట్లను గురువారం నరికివేశారు. స్థానిక బోటుకుగుంట చెరువు గట్టుపై ఉన్న చెట్లను నరికి, కలపను అక్రమంగా తరలించే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో అక్కడికి చేరుకున్న గ్రామస్తులు అక్రమ రవాణాను అడ్డుకుని, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు.

ఖైదీలకు న్యాయ సహాయం

ఏలూరు రూరల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి రాజేశ్వరి గురువారం ఏలూరులో జిల్లా కారాగారాన్ని సందర్శించారు. ఖైదీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కారాగాయంలో అందిస్తున్న ఆహారం, తాగునీరుతో పాటు మౌలిక వసతులను పరిశీలించారు. ఖైదీల కేసు వివరాలు, వారి ప్రవర్తనతో పాటు పొందుతున్న న్యాయ సహాయం గురించి కారాగార అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మట్లాడుతూ ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం అవసరమైన పక్షంలో న్యాయ సేవాధికార సంస్థ ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. ప్రభుత్వ పథకాలు పొందడంలో సహకరిస్తామన్నారు. ఆమె వెంట చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యుడు మునేశ్వరరావు, జిల్లా జైలర్ వెంకటరెడ్డి, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

వచ్చే ఎన్నికల్లో జగనన్నే మళ్లీ సీఎం

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- జంగారెడ్డిగూడెం 6వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం



సంక్షేమ లబ్ధి బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావడం ఖాయమని చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ధీమా వ్యక్తం చేశారు. జగనన్నను మళ్లీ సీఎం చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అహర్నిశలు కృషి చేస్తామన్నారు. స్థానిక 6 వ వార్డులో జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొన్నారు. 6 వ వార్డు కౌన్సిలర్ నేకూరి కిషోర్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే ఎలీజా ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మమేకమై, వారికి జరిగిన మేలును గూర్చి అడిగి తెలుసుకున్నారు. ప్రతి కుటుంబానికి జరిగిన లబ్ధిని ఆయన చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఎలీజా మాట్లాడుతూ తాము ప్రజల దగ్గరకు వెళుతుంటే సంతోషంతో హారతులిచ్చి, పూలమాలలతో ఘన స్వాగతం పలుకుతున్నారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉన్నారని, ప్రజలంతా సంతోషంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నారని తెలిపారు. ఈ నమ్మకంతోనే రానున్న 2024 ఎన్నికలలో 175 కి 175 సీట్లు సాధించి జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేస్తామని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. ఎండలు అధికంగా ఉన్నా ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు తనతో గడపగడపకు కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి, కమిషనర్ పి.భవానీప్రసాద్, వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు (అంజి), కౌన్సిలర్‌లు చిటికెల అచ్యుత రామయ్య, లోకవరపు వెంకటేశ్వరరావు, ఉగ్గం దుర్గాప్రసాద్, రాష్ట్ర షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ అక్బర్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్నా, పాములపర్తి శ్రీనివాసరావు, భూపత్తుల శివ, సిరిబత్తుల శ్రీను, ఉర్లాపు రవి, యడ్లపల్లి వెంకటేశ, కవి, ముప్పిడి సుబ్బారావు, ఎం.నాగరాజు, కొత్తూరి పెద్దా, తడికమళ్ళ రామ్, ముప్పిడి జగదీష్, యడ్లపల్లి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రం తనిఖీ



లక్కవరం రైతు భరోసా కేంద్రాన్ని తనిఖీ చేసిన డీఎస్‌వో సత్యనారాయణ రాజు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని లక్కవరంలో రైతు భరోసా కేంద్రాన్ని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కె.సత్యనారాయణరాజు గురువారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆర్‌బీకే ద్వారా ఎంత ధాన్యం సేకరించారు, ఎంత ధాన్యం బయటికి వెళ్లింది అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గోనె సంచుల కొరత ఉంటే పంపిస్తామని, రైతులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ధాన్యాన్ని సేకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కె.స్లీవ జోజి, సివిల్ సప్లయి డిప్యూటీ తహసీల్దార్ రమేష్, రెవెన్యూ, ఆర్‌బీకే సిబ్బంది పాల్గొన్నారు.

వలంటీర్లు.. సంక్షేమ వారధులు

గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



ద్వారకాతిరుమలలో వలంటీర్లను సత్కరిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

ద్వారకాతిరుమల : గ్రామ వలంటీర్లు సంక్షేమ వారధులని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు చేరవేయడంలో వారు కీలక పాత్ర పోషిస్తున్నారని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక ఎస్ఎస్ వేదిక కల్యాణ మండపంలో గురువారం వలంటీర్లకు సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే తలారి ముందుగా సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలను పొందిన వలంటీర్లకు దుశ్శాలువాలు కప్పి, ప్రశంసా పత్రాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలని, ప్రభుత్వానికి మరింత మంచిపేరు తీసుకురావాలని కోరారు. వలంటీర్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లాల్సిన బాధ్యత వలంటీర్లపైనే ఉందని సూచించారు. వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవలను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేక విమర్శలు చేస్తున్నాయని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజబాబు, జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్, పార్టీ మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, మండల మహిళా అధ్యక్షురాలు మల్లెపూడి నాగమణి, బొండాడ వెంకన్నబాబు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉక్కుర్తి వెంకట్రావు, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, రుద్ర శివాజీ, పెద్దిరెడ్డి నాగేశ్వరరావు, యిమ్మడి నాగు, అచ్యుత ఏసుబాబు, పోలకంపల్లి అనిల్‌బాబు, సొసైటీ చైర్‌పర్సన్లు గోపా నాగేశ్వరరావు, భోగరాజు చిన్ని, గుర్రాల లక్ష్మణ్, జేవీకే రెడ్డి, లక్కాబత్తుల సిద్ధిరాజు, మానుకొండ కన్నయ్య, దిర్శిపాం అన్నవరం, బిరుదుగడ్డ చల్లారావు, ఆచంట బన్ను, నల్లంటి రామారావు, అల్లాడ హరేరామకృష్ణ, యాచమనేని నాగేశ్వరరావు, షేక్ భాషా, మిడతా చందు తదితరులున్నారు.

కొనసాగుతున్న శిక్షణా తరగతులు



ధర్మాజీగూడెంలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



కొయ్యలగూడెంలో పద్యాలు చదువుతున్న చిన్నారులు

లింగపాలెం : ధర్మాజీగూడెం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ తరగతుల్లో గురువారం రిటైర్డ్ హెచ్‌ఎం కేడీవీఎస్ సత్యన్నారాయణ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. అంతేకాకుండా నీతి కథలు, చందమామ, బాలమిత్ర, బొమ్మరిల్లు కథలు విద్యార్థులచే చదివించి రాయించారు. విద్యార్థులచే రంగు కాగితాలు, అట్టపెట్టెలతో బొమ్మలు తయారు చేయించినట్లు గ్రంథాలయాధికారిణి వి.రమణ తెలిపారు.

కొయ్యలగూడెం : గ్రంథాలయాల్లో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా కొయ్యలగూడెం శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థుల చేత నీతి పద్యాలు చదివించారు. లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయులు విద్యార్థులకు నీతి సూత్రాలను, పాఠాలు తెలియజేశారు. విద్యార్థి దశలోనే నైతిక విలువలు పెంపొందించుకోవడం వల్ల ఉత్తమ జీవన ప్రమాణాలను కలిగిన పౌరునిగా ఎదుగుతారన్నారు. అనంతరం నీతి పద్యాలు రచించిన కవులు గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు.

పిల్లలను తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షించాలి



చింతలపూడిలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి : కుటుంబ వ్యవస్థలోని మార్పులే పిల్లలు తప్పిపోవడానికి ప్రధాన కారణంగా నిలుస్తుందని, తల్లితండ్రులు వారి పిల్లలను నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ సి.మధుబాబు అన్నారు. వరల్డ్ చిల్డ్రన్ మిస్సింగ్ డే సందర్భంగా చింతలపూడి ఎంపీడీవో కార్యాలయంలో గురువారం నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. కుటుంబం నుంచి తప్పిపోయిన పిల్లలు తారసపడితే వారిని పోలీసులకు గాని, అంగన్‌వాడీలకు గాని, 1098 చైల్డ్‌లైన్ వారికి సమాచారం ఇచ్చి అప్పగించాలని సూచించారు. పిల్లలు తప్పిపోవడానికి కారణం కుటుంబ వ్యవస్థలోని లోపాలే అన్నారు. పిల్లల విషయంలో తల్లితండ్రుల పర్యవేక్షణ ఉండాలన్నారు. అలాగే కొంతమంది ముఠాలు పిల్లలను అపహరించడం, కొంమతంది ప్రేమ పేరుతో పిల్లలను మోసం చేస్తున్నారన్నారు. అత్యధిక శాతం పిల్లలపై దాడులు చేస్తే పోక్సో చట్టం ద్వారా శిక్షలు ఉన్నాయని తెలిపారు. కావున పోలీసులు, అంగన్‌వాడీలు, ఉపాధ్యాయులు పిల్లలకు కల్పించిన రక్షణ చట్టాలను తెలియజేస్తూ, చిన్నారులు వారి బాల్యాన్ని కోల్పోకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పట్నాల శ్రీనివాస్, ఎల్‌వీ చైతన్య, బుళ్ల ఏసుపాదం, చింతలపూడి సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పి.మాధవి, సోషల్ వర్కర్ ఎండీ అక్బర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

బడి పిల్లలను పనులకు పంపకూడదు



మాట్లాడుతున్న అశోక్‌కుమార్

జంగారెడ్డిగూడెం రూరల్ : అంతర్జాతీయ తప్పిపోయిన పిల్లల దినోత్సవం సందర్భంగా మండలంలోని పట్టెన్నపాలెంలో గురువారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు తల్లాడ అశోక్‌కుమార్ మాట్లాడుతూ బాల, బాలికలతో పనులు చేయించడం, మానవ అక్రమ రవాణా చట్టరీత్యా నేరమన్నారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి ఏవీవీ భువనేశ్వరి మాట్లాడుతూ బడి ఈడు పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నారు. విద్యార్థులు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను వినియోగించుకుని ఉన్నత విద్యావంతులవ్వాలన్నారు. న్యాయవాది వింజమూరి కిరణ్ కిషోర్ మాట్లాడుతూ చిన్నారులను వ్యాపార దుకాణాల్లో పనులకు పంపకూడదని సూచించారు. సర్పంచ్‌లు పసుపులేటి రత్నకుమారి, పారేపల్లి నాగేంద్రబాబు, సచివాలయ కన్వీనర్ పసుపులేటి నాగార్జున, బార్ సభ్యులు మేకల రామ్మోహనరావు, మాదేపల్లి క్రాంతి, పిల్లా పెద్దిరాజు, కేకేవీ కృష్ణ, రాము, శివ, బల్లే సాయికుమారి, తోట పద్మిని తదితరులు పాల్గొన్నారు.

చిల్డ్రన్ బైబిల్ క్లబ్‌లో చిన్నారులకు ఆటవిడుపు



లూథరన్ చర్చిలో ఆటవిడుపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కొయ్యలగూడెం : చిల్డ్రన్ బైబిల్ క్లబ్ ఏర్పాటు చేసి చిన్నారులకు ఆటవిడుపు కార్యక్రమాలతో పాటు ఆహ్లాదకరమైన ఆధ్యాత్మిక అంశాలపై అవగాహన కల్పించడం స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ మండల కో-కన్వీనర్ తాడిగడప రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం అంకాలగూడెం సెయింట్ లూథరన్ చర్చిలో విద్యార్థులతో ఆయన కొద్దిసేపు గడిపారు. వేసవి రోజులలో విద్యార్థులకు ఉదయం, మధ్యాహ్నం పౌష్టికాహారాన్ని అందించడంతోపాటు క్రీడలను నేర్పిస్తూ విద్యార్థుల్లో క్రీడోల్లాసం పాస్టర్ ముప్పిడి రాజేష్ బాబు కల్పించడంపై కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంతో సహా పరిసర ప్రాంతాలలోనే ఉన్న సుమారు 150 మంది విద్యార్థులు హాజరవుతున్నారని పాస్టర్ రాజేష్ తెలిపారు. ఈ నెలాఖరి వరకు ఆటవిడుపు కార్యక్రమాలను నిర్వహించి సంఘ పెద్దల సమక్షంలో విద్యార్థులకు బహుమతి ప్రదానోత్సవం చేస్తామని రామకృష్ణ అన్నారు.

విధుల్లోకి చేర్చుకోవాలంటూ నిరసన

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థలో ఔట్‌సోర్సింగ్ సిబ్బందిగా పనిచేస్తున్న వ్యక్తిని విధుల్లో నుంచి తొలగించారని తనకు మళ్లీ ఉద్యోగం ఇవ్వాలని కోరుతూ నిరసన తెలిపాడు. ఆర్‌ఆర్‌పేట నగరపాలక సంస్థ వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. వెంటనే స్పందించిన ఏలూరు టూటౌన్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని అతన్ని అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చారు. వివరాలు ఇలా ఉన్నాయి... ఏలూరు చాణిక్యపురి కాలనీ 2వ రోడ్డు ఏటిగట్టు ప్రాంతానికి చెందిన డి.సూరిబాబు ఏలూరు నగరపాలక సంస్థ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా వాటర్ ట్యాంక్ వద్ద పనిచేస్తూ ఉంటేవాడు. ఇటీవల అతను అనారోగ్యంతో విధులకు హాజరుకాకపోవడంతో అధికారులు అతన్ని విధుల నుంచి తప్పించారు. తనను మళ్లీ ఉద్యోగంలో చేర్చుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం రాత్రి ఆర్‌ఆర్‌పేట వాటర్ ట్యాంక్ వద్ద ఆత్మహత్య చేసుకుంటానంటూ బెదిరింపులకు దిగాడు.

చిరుధాన్యాల సాగుపై ఆసక్తి చూపాలి



గడ్డపల్లిలో చిరుధాన్యాల పంటలపై అవగాహన కల్పిస్తున్న ఏపీఎం శ్రీనివాసరావు

పోలవరం రూరల్ : ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజన రైతులు చిరు ధాన్యాల పంటలపై ఆసక్తి చూపాలని ఐకేపీ ఏపీఎం బి.శ్రీనివాసరావు తెలిపారు. పోలవరం మండలం గడ్డపల్లి, గిన్నేపల్లి, తంగేడుకొండ, చిలకలూరు, దార్వాడ గ్రామాల్లో ఆయన గురువారం చిరు ధ్యాన్యాల పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలవరం రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ద్వారా ఈ ఏడాది 500 ఎకరాల్లో చిరుధాన్యాల పంటలను పండించేందుకు సిద్ధం కావాలన్నారు. జొన్న, చోళ్లు, గంటెలు తదితర చిరుధాన్యాలను సాగుచేయాలన్నారు. డీఆర్‌డీఏ, ఐటీడీఏ ఆధ్వర్యంలో ఈ చిరుధాన్యాల పంటలపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. రైతులకు రూ.2వేలు పెట్టుబడి కూడా అందజేస్తున్నామన్నారు. దీంతో ఆ ప్రాంతంలోని రైతులు సాగుచేసేందుకు ముందుకు వచ్చారని తెలిపారు.

75 మందికి కంటి వైద్యసేవలు

గణపవరం : వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం గ్రామీణ ప్రాంతాలలోని వృద్ధులకు వరమని ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని, కంటి సమస్యలనుంచి బయటపడాలని చిలకంపాడు సర్పంచ్ చుక్కా అప్పారావు, ఎంపీటీసీ పెచ్చెట్టి వెంకటనారాయణ అన్నారు. గురువారం చిలకంపాడు గ్రామ సచివాలయం పరిధిలో పీహెచ్‌సీ ఆధ్వర్యంలో 60 ఏళ్లు నిండిన అవ్వాతాతలకు వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఉచిత కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వ్యాధులను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే వైద్యసహాయం పొందాలని, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలని కనీసం వారానికి మూడు సార్లు ఆకుకూరలు తినాలని సీహెచ్‌వో జాలాది విల్సన్ సూచించారు. 75 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరందరికీ కళ్లజోళ్లు ఉచితంగా అందచేస్తామని అప్తమాలజిస్ట్ శ్రీనివాస్ తెలిపారు. ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శన



ఉత్సవాల్లో జబర్దస్త్ టీం సాంస్కృతిక ప్రదర్శన

కొయ్యలగూడెం : పొంగుటూరు గ్రామ దేవత గంగానమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఎక్స్‌ట్రా జబర్దస్ కామెడీ షో నిర్వహించారు. చిత్రం శ్రీను, యాంకర్ సుజాత, సర్దైనోడు ఫేమ్ అప్పారావు, జబర్దస్త్ షరీఫ్ క్లాసికల్ డాన్స్ వంటి కళాత్మక అంశాలతో అలరించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ కామెడీ షో కళాకారులతో సెల్ఫీలకు అభిమానులు ఎగబడ్డారు. సుమారు 1500 మందికి పైగా పరిసర గ్రామ ప్రజలు కామెడీ షోకు హాజరుకావడంతో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కార్మికులకు జీతాలు చెల్లించకుంటే ఆందోళన చేస్తాం

భీమడోలు : సూరప్పగూడెంలోని హారిక సీ ఫుడ్స్ రొయ్యల ప్రాసెసింగ్ యూనిట్లో పని చేస్తున్న కార్మికులకు ఏడాదిగా జీతం ఇవ్వకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు అన్నారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. ఏడాది కాలంగా ఇక్కడ పని చేస్తున్న 11 మంది కార్మికులకు జీతం ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, రూ.4 నాలుగు లక్షలు బకాయిలు చెల్లించాలన్నారు. మంగళవారం నాటికి వేతనాలు ఇవ్వని పక్షంలో నిరవధిక దీక్షను చేపడతామన్నారు. కార్యక్రమంలో బాధిత కార్మికులు ఉప్పు మాణిక్యాలరావు, బాబూరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు జీలుగుమిల్లిలో వలంటీర్లకు వందనం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జీలుగుమిల్లి మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కేఎం మంగతయారు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని సచివాలయాల్లో ఉత్తమ సేవలు అందిస్తూ అవార్డులకు ఎంపికైన వలంటీర్లకు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు చేతుల మీదుగా సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, అధికారులు పాల్గొని జయప్రదం చేయాలని ఆమె కోరారు.

నేడు రోటరీ జిల్లా గవర్నర్ పర్యటన

జంగారెడ్డిగూడెం : రోటరీ జిల్లా 3020 గవర్నర్ విశ్వనాధం భాస్కరరాం జంగారెడ్డిగూడెంలో శుక్రవారం పర్యటించనున్నట్లు రోటరీ అధ్యక్షుడు దాకారపు కృష్ణ తెలిపారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించే పురస్కార ప్రదానం కార్యక్రమంలో ఆయన పాల్గొంటారన్నారు. అలాగే క్లబ్ అసెంబ్లీ, యువజనోత్సవాల కార్యక్రమాల బహుమతి ప్రదానంతోపాటు పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారని వివరించారు. ఈ కార్యక్రమంలో 15 మందికి వివిధ రంగాల్లో వారు చేసిన సేవలకు గాను రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్సీ పురస్కారాలు అందజేయనున్నట్లు వివరించారు.

2న చండీహోమం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో జూన్ 2వ తేదీన ఉదయం 7 గంటల నుంచి చండీహోమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. జ్యోతిష్య వాస్తు ఆగమ సిద్ధాంతి ఈరంకి సుబ్రహ్మణ్య శర్మ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చండీహోమం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చింతలపూడి : విద్యుత్ మరమ్మతులు, ట్రీకటింగ్, ఇతర పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ కేఎం అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. చింతలపూడి 11కేవీ టౌన్ ఫీడరు, నాగిరెడ్డిగూడెం 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కోలాట బృందానికి సహకారం



కోలాట బృందం సభ్యులతో తపన చౌదరి

లింగపాలెం : లింగపాలెం మండలం భోగోలు సచివాలయ శివారు వెంకటాపురం గ్రామానికి చెందిన 30 మంది కోలాట బృందానికి గురువారం తపన ఫౌండేషన్ వ్యవస్థాపకులు గారపాటి సీతారామాంజనేయ చౌదరి డ్రస్ మెటీరియల్ అందజేశారు. అనంతరం కోలాట బృందం సభ్యులు ఈ డ్రస్సు, పరికరాలను ధరించి నృత్య ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీతారామాంజనేయ చౌదరి మాట్లాడుతూ మన సంస్కృతిని కాపాడేందుకు తమ వంతుగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాల్లో కోలాట బృందాలకు సహకారం అందించి ప్రోత్సహిస్తున్నామన్నారు. త్వరలో ఏలూరులో 10 వేల మంది కోలాట బృందంతో భారీ ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : ఇద్దరు యువకులు తనను, తన అక్కను వేధిస్తున్నారని, వారిపై చర్య తీసుకోవాలని ఎ.పోలవరానికి చెందిన యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఎ.పోలవరానికి చెందిన యువతి చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటోంది. అదే గ్రామానికి చెందిన వనపర్తి పవన్, వనపర్తి సతీష్ తనను, తన అక్కను ప్రేమిస్తున్నానని వెంటపడి వేధిస్తున్నారన్నారు. ఈ క్రమంలో ఈనెల 18వ తేదీన యువతి, అమె అక్క ఇంటి వద్ద ఉన్న సమయంలో వారి ఇంటి సమీపానికి వచ్చిన ఇద్దరు యువకులు అసభ్యకరంగా వ్యవహరిస్తూ, వారిని ప్రేమించకపోతే చంపుతామని బెదిరించారని ఫిర్యాదులో పేర్కొందన్నారు. యువతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.